క్లుప్తంగా

కేయూ హాస్టళ్ల అదనపు డైరెక్టర్‌కు సన్మానం

కేయూ క్యాంపస్: కేయూ హాస్టళ్ల, మెస్‌ల అదనపు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్‌ఆర్‌ఎం విభాగం కాంట్రాక్టు అధ్యాపకురాలు డాక్టర్ సుచరితపాల్‌ను మంగళవారం విభాగం అధిపతి ఆచార్య టి.యాదగిరిరావు, పాఠ్యప్రణాళిక అధ్యక్షుడు ఆచార్య పి శ్రీనివాస్‌రావులు శాలువకప్పి పూల బొకేను అందించి సన్మానించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ ఎ శ్రీనివాస్, డాక్టర్ బుర్రి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్‌ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ ఎంజీఎం ఆయుష్ డిపార్ట్‌మెంట్ సౌజన్యంతో వరంగల్ మన ముచ్చట్ల గ్రూప్ ప్రతినిధుల ఆధ్వర్యంలో మధ్యకోట బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు మెడికల్ కిట్‌లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టి.సురేష్, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ హాజరై 200 మంది విద్యార్థులకు మెడికల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మ, డాక్టర్ రహిమతుల్లాఖాన్, పెరుమాండ్ల మధు, బోళ్ల అశోక్, హెచ్‌ఎం రాంజీ, అధ్యాపకులు రాములు, కిశోర్, భాగ్యరాజు, హరి, ఉమాశంకర్, సంతోష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు

హసన్‌పర్తి : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ సర్కార్ నిర్ణయంపై ఉద్యోగులు హర్షం వ్యక్త చేశారు. మంగళవారం మండల కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్ల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆర్టీసీ ఉద్యోగులు యుగంధర్, ఆరోగ్యం, నవీద్, సమన్వయ కమిటీ సభ్యులు పిట్టల కుమారస్వామి, ఇమ్మడి రాజేందర్, దీకొండ బిక్షపతి, గౌరిశెట్టి కృష్ణమూర్తి, వల్లాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు గొప్పగా ఉండాలి

కాజీపేట రూరల్ : విద్యార్థుల లక్ష్యాలు గొప్పగా ఉండాలని, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పాఠశాల స్థాయి నుంచే పెంపొందించుకోవాలని కాజీపేట సీఐ సార్ల రాజు అన్నారు. మంగళవారం కాజీపేట ఫాతిమానగర్‌లోని మాంట్‌ఫోర్టు స్కూల్ సీబీఎస్‌ఈలో ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ విన్సెంట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇన్విస్టిచర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ పాల్గొని మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థి నాయకుడు ఎస్.ప్రణీష్, నాయకురాలు జి.వెన్నల, నాలుగు బృందాలకు, నాయకులను, క్లబ్ నాయకులను నియమించి వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

కాజీపేట: కాజీపేట డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురికి రెండు రోజులు జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె. విద్యాసాగర్‌రావు తీర్పునిచ్చారు. సీఐ కె.సుజాత తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 11 మందిని మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. పులువాల కుమారస్వామి, మారెపల్లి శ్రీకాంత్, ఓరుగంటి ప్రవీణ్‌లకు జైలు శిక్ష, 8 మందికి రూ.14,400 జరిమానా విధించినట్లు తెలిపారు.

జువైనల్ హోమ్ నుంచి ఇద్దరి బాలలు పరార్

రామన్నపేట : వరంగల్ ఆటోనగర్‌లోని జువైనల్ హోం నుంచి మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఇద్దరు బాలనేరస్తులు పరారయ్యారు. దొంగతనం కేసులో ఇద్దరు చిన్నారుల్లో నిందితులుగా నిర్ధారణ కావడంతో జువైనల్‌లో హోంలో శిక్షను అనుభవిస్తున్నారు. జువైనల్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

27 నుంచి డీవైఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి శిక్షణతరగతులు

న్యూశాయంపేట : దేశవ్యాప్తంగా అందరికి విద్య ఉపాధి కోసం నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తున్న భారత ప్రజాతంత యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు ఈనెల 27 నుంచి 29 వరకు హనుమకొండలో జరుగుతాయని వాటి జయప్రదానికి సహకరించాలని హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి కోరారు. మంగళవారం రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో అధ్యక్షుడు నోముల కిషోర్, ఉపాధ్యక్షులు సుచందర్, సురేశ్, చిరంజీవి, మౌనిక, సుస్మిత, హర్ష, కరుణాకర్, దేవేందర్ పాల్గొన్నారు.

కేవీ ప్రిన్సిపాల్ మృదుల బదిలీ

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని కేంద్రీయ విద్యాలయ వరంగల్ ప్రిన్సిపాల్ మృదులను కేవీ డిప్యూటీ కమిషనర్ అమర్‌పాల్ సింహ్ ఏపీలోని కేవీ సూర్యలంకకు బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులను జారీ చేయగా కేవీ వరంగల్‌కు మంగళవారం చేరాయి. బదిలీపై వెళ్లనున్న మృదుల స్థానంలో ఇటీవల కేవీ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఎంపిక చేసిన ప్రిన్సిపాల్ స్థాయి అభ్యర్థుల్లో ఒకరు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ అధ్యక్షురాలు కళ్యాణి, కార్యదర్శి ప్రభాకర్


బాలసముద్రంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

హన్మకొండ: ఎల్‌ఐసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ వరంగల్ డివిజన్ అధ్యక్షురాలు వి.కల్యాణి, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎల్‌ఐసీ డివిజన్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన సమయంలో ఎల్‌ఐసీ క్లాస్ వన్ ఆఫీసర్స్ ఫెడరేషన్, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష వైఖరిని నిరసిస్తూ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కల్యాణి, ప్రభాకర్ మాట్లాడుతూ ప్రధానంగా కుటుంబ పెన్షన్ 30 శాతం పెంచుకునే అవకాశముందని, అనుమతించాలని ఎల్‌ఐసీ యాజ మాన్యం కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించి నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు అమలు జరపకపోవడం శోచనీయమన్నారు. సంస్థలో పదవీ వి రమణ పొందే ఉద్యోగుల శాతం అధికంగా ఉందని, ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే నూతన ఉద్యోగ నియామకాలను సత్వరమే చేపట్టాలన్నారు. ఇతర సంస్థల యాజమాన్యాలు పీఎఫ్‌కు 14 శాతం కాంట్రిబ్యూషన్‌ను ఉద్యోగుల భవిష్యనిధికై సమకూరుస్తున్నాయని తెలిపారు. ఎల్‌ఐసీ యాజ మాన్యం కూడా అదే బాటలో పయనించాలన్నారు. ఎల్‌ఐసీ క్లాస్ వన్ ఫెడరేషన్ వరంగల్ డివిజన్ అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ యాజమాన్యానికి చార్టరాఫ్ డిమాండ్లు సమర్పించి ఏడాది కావస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో ప్రత్యక్ష పోరాటాలకు ఉద్యోగులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మామునూర్ ఎయిర్‌పోర్ట్‌ను పునరుద్ధరించాలి

హన్మకొండ : వరంగల్ అభివృద్ధి దృష్ట్యా మామునూర్ ఎయిర్‌పోర్ట్‌ను పునరుద్ధరించడానికి 253 ఎకరాల భూమి కేటాయించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలో జరిగిన ప్రజావేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరాల్లో ఉడాన్ పథకం ద్వారా ఎయిర్‌పోర్ట్‌లను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినా ఇప్పటి వరకు మామునూరు ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణకు మోక్షం కలుగలేదన్నారు. ఎయిర్‌పోర్ట్‌తో పాటు నియో మెట్రో రైల్ నిర్మాణం జరిగితే వరంగల్ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో ప్రజా వేదిక నాయకులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఖిలా వరంగల్ : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మండల ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బుధవారం ఉదయం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతల్ బ్రిడ్జి సమీపంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు పలు రకాల వాహనాలను వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు నేరుగా వేలంలో పాల్గొనాలని కోరారు. సమాచారం కోసం 9000 286908 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

పరీక్షలు వాయిదా వేయాలి



విద్యారణ్యపురి: టీటీసీ 42 రోజుల శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈనెల 12న టీటీసీ పరీక్షను నిర్వహించనున్నారని, అయితే అదే రోజు టీఆర్ ఐఈటీని నిర్వహిస్తున్నారన్నారు. టీజీటీ, పీజీటీ పరీక్షలున్నాయని చాలా మంది టీటీసీ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నందున టీటీసీ పరీక్షను వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి వినతిపత్రం ఇచ్చారు.

డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ బాధ్యులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల బాధ్యులకు అనుమతి లేదని విద్యాశాఖ డైరెక్టర్ నిర్ణయించి ఆదేశాలు ఇవ్వటాన్ని నిరసిస్తూ మంగళవారం స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశారు. పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనికి వెళ్లేందుకు విద్యార్థి సంఘాల నాయకులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, బాధ్యులు శివకుమార్, భన్ని సిద్దార్థ, అభిశేక్ పాల్గొన్నారు.

కేయూ వద్ద ఎస్ఎఫ్ఐ నిరసన

కేయూ క్యాంపస్: పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతి లేదంటూ విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన జారీ చేసిన ఆదేశాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు కాకతీయ యూనివర్సిటీ మొదటిగేట్‌వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు మిశ్రీన్‌సుల్తానా, కార్యదర్శి మంద శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు బి.కళ్యాణ్, సహాయ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ


హన్మకొండ అర్బన్ : బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎస్ఆర్ఆర్ ప్రతినిధులు

హన్మకొండ అర్బన్ : నగరంలోని భట్టుపల్లి ఇందిరమ్మకాలనీ, నాగేంద్రకాలనీ ప్రాంతంలోని వరద బాధితులకు ఎస్ఆర్ఆర్ ఫార్చ్యూన్ ఇన్‌ఫ్రా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ కటారి రమేష్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు చాలా మంది ప్రజలు సర్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, రాబోయే రోజుల్లో కూడా సంస్థ తరఫున వారికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డి.కృష్ణ నాయక్, కె.పురుషోత్తంరెడ్డి, మధుకర్‌రెడ్డి,రవిచంద్ర, కిషోర్, రాంరెడ్డి, గోవింద్, జగన్, పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ పెరికవాడలోని ముంపు బాధితులను మంగళవారం ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధితులకు వారం సరిపడా నిత్యావసర సరుకుల బ్యాగును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ, సుధాకర్ మోడెం ప్రవీణ్, వినయ్, వడ్డె కోటేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


హన్మకొండ కల్చరల్ : వ్రతంలో పాల్గొన్న దంపతులు

హన్మకొండ కల్చరల్ : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం అధికమాస శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని హనుమకొండ రెడ్డి కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. 60 మంది దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బత్తిని వెంకటయ్య, వెంకటరమణ, విజయలక్ష్మి, ప్రముఖ సంస్కృత పండితులు శతగోపాచార్య పాల్గొన్నారు. టీటీడీ డీపీపీ జిల్లా ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కృష్ణమూర్తి పర్యవేక్షించారు.

కాశిబుగ్గ : స్థానిక రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం ఆధిక శ్రావణ బహుళ పౌర్ణమిని పురస్కరించుకుని సాముహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణామాచార్యులు, రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతాల్లో భక్తులు పాల్గొని పూజలు చేశారు. పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు వంగరి రవి, సురేష్, సుల్తాన సమ్మక్క, మంచాల సృజన, రోజా తదితరులు పాల్గొన్నారు. స్థానిక కాశీవిశ్వేశ్వరాలయంలో మంగళవారం అధిక శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున కాశీవిశ్వేశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.

వీకే స్పెల్లింగ్ పోటీల్లో స్పెక్ట్రా గ్లోబల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతిరెడ్డి

హన్మకొండ : వీకే స్పెల్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని స్పెక్ట్రా గ్లోబల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. తమ పాఠశాలకు చెందిన కె.చర్వి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి రూ.15 వేల నగదు బహుమతి గెలుచుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.ప్రశాంతిరెడ్డి తెలిపారు. బి.వరుణ్‌దత్త రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు, పి.హర్షిణి, ఆర్.ఆరాధ్య తృతీయ బహుమతి, ఎం.యశస్వి ఐదో ర్యాంకు, బి.హద్వితారెడ్డి ఏడో ర్యాంకు, బి.హస్మిక 8వ ర్యాంకు సాధించారని ఆమె వివరించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎల్.ప్రశాంతిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మహానగరం మునగలేదు..ముంచారు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి


హన్మకొండ : మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి


ఖిలావరంగల్ : నిరాశ్రయులకు బియ్యం బ్యాగులు అందజేస్తున్న ప్రదీప్‌రావు

హన్మకొండ: వరంగల్ మహానగరం మునగలేదని, అసమర్థపాలన, చేతగాని తనంతో వరంగల్‌ను వరదలో ముంచారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం హనుమకొండ ఎన్జీఓస్ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీసం దిద్దుబాటు చర్యలు కూడా తీసుకోకపోవడంతో వరదలతో ముంపునకు గురికావల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో గ్రేటర్ వరంగల్ ఎన్నికల ముందుకు వచ్చిన మంత్రి కేటీఆర్ నాలాలపై ఆక్రమణలున్నాయి, వాటిని తొలగిస్తామని చెప్పారన్నారు. నాలాలకు రిటేన్‌వాల్ నిర్మిస్తామని చెప్పినా ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. వరదలు వచ్చి నష్టం జరిగితే పరిశీలించి ఆదుకోవాల్సిన సీఎం కేసీఆర్ మహారాష్ట్రకు వెళ్లి రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వినయ్‌భాస్కర్‌కు ఒక విజన్ లేదని విమర్శించారు. నగరంలో 150 చెరువులు, కుంటలు ఉంటే ఇప్పుడు 40 మాత్రమే మిగిలాయన్నారు. రూ.100 కోట్లు పెడితే ముంపు నుంచి బయటపడేయవచ్చన్నారు. వర్షంలో ఇళ్లు కూలిన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, నిత్యావసర వస్తువులు అందించాలని, తక్షణసాయం కింద రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రకాళి చెరువుకు గండి పడ్డదని తాను జూలై 27 నాడే చెప్పానని, రెండు రోజుల తర్వాత 29న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, మేయర్ గుండు సుధారాణి అధికారులతో చేరుకుని డ్రామా ఆడారన్నారు. తాము సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళితే తమ కార్యకర్తలపై ఇంతెజార్‌గంజ్ సీఐ శ్రీనివాస్ అకారణంగా దాడి చేశాడన్నారు. సీపీకి ఫిర్యాదు చేశామని, అలాగే మానవ హక్కుల, బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో నిరంజన్, తరుణ్‌రెడ్డి, శ్రావణ్ యాదవ్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు అండగా బీజేపీ

ఖిలావరంగల్: ముంపు బాధితులకు కేంద్ర ప్రభుత్వం బీజేపీ అండగా ఉంటుందని బీజేపీ నేత, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. మంగళవారం వరంగల్ 33వ డివిజన్ పెరుకవాడలోని ముంపునకు గురైన ప్రాంతంలో బీజేపీ నేత మంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరాశ్రయుల కుటుంబానికి బియ్యం బస్తా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముత్తినేని శ్రీనివాస్, రాజేందర్, వీరన్న, వీరస్వామి, సతీష్‌కుమార్, రజనీ, అజయ్‌గౌడ్, రాజు, శ్రీనివాస్, కందిమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

కాజీపేట రూరల్ : ఇటీవల కురిసిన వర్షాలకు అతలాకుతలమై తీవ్రంగా నష్టపోయిన రైతులు, వరద బాధిత కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని బీజేపీ మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం డిమాండ్ చేశారు. బోడగుట్ట సమీపంలో నీట మునిగిన పొలంను నాయకులు మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట మణి కుమార్, చాంద్‌పాషా, స్వామి, శ్రీను, జంపయ్య, రఫీ, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయాలి

కాజీపేట: పీజీఆర్ గార్డెన్‌లో బుధవారం జరిగే లయన్స్‌క్లబ్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీలో ఉన్న పీజీఆర్ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లయన్స్ గవర్నర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు కేబినెట్ ప్రమాణ స్వీకారానికి ఇన్స్టాలేషన్ ఆఫీసర్‌గా మౌనికా సావంత్ హాజరవుతున్నట్లు తెలిపారు. సిహెచ్.వెంకటరమణారెడ్డి, గోపాల్‌రావు, ముకుంద రెడ్డి, కట్టంగూర్ రాంగోపాల్ రెడ్డి, రమణా రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

న్యూశాయంపేట : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం హనుమకొండ జిల్లా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జూలియస్ సీజర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.మనోహర్‌రావు, ఉపాధ్యక్షులుగా సదానందం, ఈసంపల్లి శంకర్, మార్పు క్రిష్టారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌కే యాస్మిన్, ప్రధాన కార్యదర్శిగా కొంగల రామచంద్రారెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఐలయ్య, సాంబయ్య, రాజారాం, సరసయ్య, కోశాధికారిగా అరుణ, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆర్డీఓను కలిసిన సంఘం నాయకులు



హన్మకొండ అర్బన్ : ఇటీవల హనుమకొండ నూతన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌ను తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేశ్ ఆధ్వర్యంలో డీలర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్, ఉపాధ్యక్షులు పోతరాజు రమేష్, బత్తుల మహేష్, ఎదులాపురం వెంకటేశ్వర్లు, కొలిపాక రాజు, సాంబయ్య, శ్రీనివాసరావు, మైస ఏలియా, విజయపాల్, మహేశ్వరం, గౌరీశంకర్, జోగు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఏసీపీని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కాజీపేట: కాజీపేట ఏసీపీగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన డేవిడ్ రాజ్‌ను పట్టణ కాంగ్రెస్ నాయకులు ఆరూరి సాంబయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. అరికెల కనకయ్య పాల్గొన్నారు.

అనుమతి లేని స్కూళ్లపై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో అనుమతి లేని పాఠశాలలు కొనసాగుతున్నప్పటికీ వాటిని మూసివేయటంలో అధికారులు నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తున్నారని ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టి.సుదర్శనం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎల్కతుర్తి మండలంలోని ఇందిరానగర్‌లో ఓ హైస్కూల్ అనుమతి లేకుండా నడుపుతున్నారని ఆరోపించారు. జిల్లాలో ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఇతర బాధ్యులు మంగళవారం డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి వినతిపత్రం సమర్పించారు. భీమారంలో ఓ ప్రైవేటు పాఠశాలలో పాఠ్యపుస్తకాలు స్కూల్ యూనిఫాం, టై బెల్టుల పేర అధికంగా తల్లిదండ్రులు నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

జేఏసీ కన్వీనర్ నరేందర్‌కు సన్మానం



ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేగేట్ ప్రాంత జేఏసీ కన్వీనర్ దిడ్డి నరేందర్‌ను మంగళవారం తెలంగాణ ఉద్యమకారుడు, వరంగల్ జిల్లా సామాజిక న్యాయవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్ కుమార్, మాజీ కార్పొరేటర్ దిడ్డి నాగరాజు, పలు యువజన సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దిడ్డి నరేందర్‌కు వారు పూల మొక్కను అందజేసి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. నరేందర్ కలిసి వారిలో నలిగంటి చంద్రమౌళి పాల్గొన్నారు.

మారిన జీవన విధానంతోనే వ్యాధులు

కాజీపేట: మారుతున్న జీవనశైలి విధానంతోనే బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అన్నారు. 62వ డివిజన్ సోమిడి అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం రక్తపోటుతో ప్రజల ఇబ్బందులు అనే అంశంపై ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి వైద్యాధికారి టి.మధులత అధ్యక్షత వహించగా శిక్షణార్థి శ్రీలత, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి ప్రసాద్, మల్లేశం, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గణపతి మండల దీక్షల తేదీలు ఖరారు

కాజీపేట : తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన కాజీపేట స్వయంభూ శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో మండల గణపతి దీక్షల తేదీలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లుశర్మ ప్రకటించారు.ఆయన మాట్లాడుతూ 41 రోజుల మండల దీక్షలు నెల 18న, 21 రోజుల అర్ధ మండల దీక్ష సెప్టెంబర్ 7న ప్రారంభమవుతాయన్నారు. 16 రోజుల షోడశ దీక్ష సెప్టెంబర్ 12న, 11 రోజుల దీక్ష 17న, మాల విసర్జనలు 29న జరుగుతాయన్నారు. సమావేశంలో భద్రకాళి దేవస్థాన ఆస్థాన పండితులు అయినవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి, వైదిక కార్యక్రమాల నిర్వాహకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

ఖిలా వరంగల్: తప్పిపోయిన బాలిక తండ్రి చెంతకు చేరింది. కరీమాబాద్ పోచమ్మ దేవాలయం సమీప కాలనీకి చెందిన గోదాసి నరేష్‌కు ఆరేళ్ల వయస్సున్న కుమార్తె గోదాసి సాయి రక్షిత మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో తల్లితో కలిసి కిరాణం షాపుకు వెళ్లింది. తల్లి ఇంటికి చేరగా కుమార్తె రోడ్డుపై తప్పిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. 11 గంటలకు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో పాప తప్పిపోయిందని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును సీఐ టి.సురేష్ చాలెంజ్‌గా తీసుకున్నారు. 8 మంది కానిస్టేబుళ్లు కరీమాబాద్ వీధులన్నీ జల్లెడ పట్టారు. కరీమాబాద్ నుంచి జన్మభూమి రోడ్డుకు వచ్చే ప్రధాన దారిలో బాలిక నడుచుకుంటూ వస్తుండగా కానిస్టేబుళ్ల కంటపడింది. వెంటనే ఆ బాలికను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై శ్రీలత చేతుల మీదుగా తండ్రికి అప్పగించారు. బాలిక ఆచూకీ కనిపెట్టిన కానిస్టేబుళ్లను సీఐ ప్రత్యేకంగా ఆభినందించారు.

కళాశాలను పుల్‌టైం నిర్వహించాలి

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట(రంగశాయిపేట) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న తరగతులను పుల్‌టైం నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ కళాశాల కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు మౌటం శివకుమార్, సంతోష తెలిపారు. మంగళవారం వరంగల్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ కాలేజీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ శోభాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ, ఇంటర్ కళాశాలలు ఒకే భవనంలో నిర్వహించడంతో ఉదయాన్నే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, విద్యార్థినీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయిలో ఇంటర్ తరగతులు నిర్వహించాలని వారు కోరారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఖిలా వరంగల్: వరంగల్ పెరికవాడకు చెందిన తోట రాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నేత సిద్ధం రజిత, నరేష్ మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.50 కిలోల బియ్యం, కోడిగుడ్లు, ఇతర సరుకులు అందజేశారు. ఆయన వెంట ఉపాధ్యాయలు ఉన్నారు.

మామునూరు: టీఎస్ఎస్పీ క్యాంపు ప్రభుత్వ పాఠశాలలో 2001–02 విద్యాసంవత్సరంలో తేనెటీగల దాడిలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు మంగళవారం పూర్వపు విద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. అలాగే గత ఏడాది ఆత్మీయ సమ్మేళనంలో తేనెటీగల దాడిలో మరణించిన విద్యార్థిని కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. ఎండీ. షాహిద్, జన్ను వినయ్‌బాబు, ఇనుమలు సురేష్,, అబ్బోజు, సింగారపు హరీష్, ఎండీ. షబానా తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల దినోత్సవం

మడికొండ: ఆటోడ్రైవర్ల దినోత్సవం సందర్భంగా మడికొండ చౌరస్తాలో తెలంగాణ ఆటో డ్రైవర్ల యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి జెండా ఎగరవేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. రాజ్‌కుమార్, రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ రాష్ట్రస్థాయి బోర్డు కమిటీ సభ్యుడిగా సురేందర్ గౌడ్



హసన్‌పర్తి : ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) రాష్ట్రస్థాయి బోర్డు కమిటీ సభ్యుడిగా భీమారం మాజీ ఉపసర్పంచ్, బీజేపీ నాయకుడు బూర సురేందర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో సురేందర్ రెండేళ్లపాటు కొనసాగనున్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌కు సురేందర్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.